మినీకథ

# జీవనజ్యోతి



— కామరాజు కనకాల

సాయంకాలం ఆఫీసునుంచి ఇంటికి తిరిగి వచ్చిన మాధవరావు దిగులుగా వాలుకుర్చీలో కూర్చుని ఓ నిట్టూర్పు విడిచాడు. ఇంతలో అతని భార్య ప్రియాంక వంట గదిలో నుంచి కాఫీ కప్పుతో వస్తూ ఏవండోయ్ మన ఊర్లోవున్న ఆశ్రమంలోకి ఎవరో గొప్ప స్వామీజీ వచ్చారట. ఆయన మంత్రించిన విబూది రాసుకుంటే పిల్లలు కలుగుతారని ఊర్లో చాలామంది అనుకొంటున్నారు. అందుచేత మీరొచ్చేసరికి వంట పని పూర్తిచేసి రెడీగా వున్నాను. పిల్లలు కాన్వెంట్ నుంచి వచ్చాక వాళ్ళే వడ్డించుకుతింటారు పదండి వెళ్దాం! అంటూ ఇంకా ఏదో అనబోతుండగా మాధవరావు కలుగజేసుకుని, స్వామీజీ మాటకేంగాని ఈ రోజు పెద్ద ప్రమాదమే తప్పిపోయింది ప్రియాంకా! ఆఫీసునుంచి స్కూటర్‌పై వస్తుండగా నాకు చిన్న యాక్సిడెంట్ జరిగింది అంటూ తలపై నున్న హెల్మెట్ తీసి గాయాన్ని భార్యకు చూపించాడు. అయ్యయ్యో ఎంత ఘోరం జరిగిందండీ! హెల్‌మెట్ ధరించకుండా మీరు స్కూటర్ నడిపివుంటే యిప్పుడు మిమ్మల్ని ఏ స్థితిలో చూసుండేదాన్నో అంటూ బాధపడుతూ భర్తను పెనవేసుకుంది. మాధవరావు ఓదార్చుతూ చూడు ప్రియాంకా నిర్లక్ష్యం, అజాగ్రత్త, మద్యపానం సేవించడం వల్లేకాకుండా మానసిక క్షోభతో వున్న వారు కూడా వాహనాలు నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయనీ ఇప్పుడిప్పుడే తెలుసుకున్నాను అన్నాడు నెమ్మదిగా. మీ మనస్సుకు మానసిక క్షోభతో బాధపెట్టినంత పని నేనేం చేశానండీ, భర్త కళ్ళల్లోకి సూటిగా చూస్తూ అంది. నీలాంటి సద్గుణవతి నాలాంటి వాడికి భార్యకావడం, నువ్వు సంతానంకోసం పడే ఆరాటం చూస్తూ నేను భరించలేకపోతున్నాను. నువ్వు తల్లివి కావాలనుకోవడం సహజం కానీ... కాలేవు. ఎందరు స్వామీజీలని సందర్శించినా, ఎన్ని పూజలు మరెన్నో వ్రతాలు చేసినా అవన్నీ ఫలించవు క్లుప్తంగా చెప్పాడు మాధవరావు. ఎందుకు ఫలించవ్? ప్రశ్నార్థకంగా చూసింది ప్రియాంక. పరిమిత కుటుంబం కోరుకునేవాడిని గనుక ఇద్దరు సంతానంతోనే వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను అన్నాడు. అంతే పిడుగులాంటి ఆవార్త విన్న ప్రియాంక పిచ్చిగా కేకవేస్తూ నేలకొరిగిపోయి నిర్జీవ ప్రతిమలా భర్తను చూస్తూ వుండిపోయింది. మాధవరావు ఆమె నిర్మలమైన చూపులని తట్టుకునే శక్తిలేక మెల్లగా ఆమెను సమీపించి ఓదార్చబోయాడు. పొంగే దుఃఖాన్ని ఆపుకోలేని ప్రియాంక భర్తను పట్టుకుంటూ నేను మీకేం ద్రోహం చేశానండీ, నాకీ శిక్ష విధించారు? అంటూ బావురుమంది. మాధవరావు లాలనగా భార్య తల నిమురుతూ, ఇందులో నా తప్పేమీ లేదు ఇదంతా మీ నాన్నగారి మూలంగానే జరిగింది.

మూడు సంవత్సరాల క్రితం ఇదే నెల ఇదేరోజున నేను పెళ్లి చూపులకని మీ ఇంటి కొచ్చినప్పుడు నిన్ను చూసిన తర్వాత తిరుగు ప్రయాణంలో బస్టాండ్ దగ్గర మీ నాన్నగారితో ఏం అన్నానో తెలుసా? సీతాపతి గారు ఇంకా నాలుగు పదులు వయస్సుకూడా నిండని నాకు

విధి వక్రించి నా భార్య గతించింది. పైగా ఇద్దరి సంతానంతో నేను వేసక్టమీ ఆపరేషన్ కూడా చేయించుకున్నాను. ముఖ్యంగా తల్లిప్రేమకు దూరం అయిన నా చిన్నారి పిల్లలిద్దరకూ ఆ లోటు భర్తీ చేయగలిగే సహనం, ఓర్పు మీ అమ్మాయికి వుంటే మీ సంబంధం చేసుకోవడంలో నాకేం అభ్యంతరం లేదు. అన్ని విషయాలు మీ అమ్మాయితో మాట్లాడి నాకు వెంటనే ఉత్తరం వ్రాయండి అని మీ నాన్నగారితో చెప్పి వచ్చేసాను ఇదుగో అందుకు మీ నాన్నగారు ఆనాడు వ్రాసిన ఉత్తరం అంటూ బ్రీఫ్‌కేస్‌లో వున్న ఉత్తరాన్ని భార్యకు అందించాడు. ఉత్తరం అందుకున్న ప్రియాంక అశ్రునయనాలతో చదువుతోంది.

–చిరంజీవి మాధవరావు క్షేమం కోరుతూ మీకాబోయే మామగారు సీతాపతి వ్రాయునది మీరు వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నట్లు మా అమ్మాయి ప్రియాంకతో చెప్పాను అందుకు ఆమె మనస్ఫూర్తిగా అంగీకరిస్తూ నాకు సంతానం ఎందుకు నాన్నా వారి బిడ్డలు నా బిడ్డలు కారా అంటూ సమాధానం ఇచ్చింది. అందుచేత మేము పెట్టే ముహూర్తానికి మీరు సిద్ధంగా వుండగలరు. ఇట్లు సీతాపతి.

ఉత్తరం చదవడం పూర్తిచేసిన ప్రియాంక భర్త నుద్దేశించి నా తండ్రి ఒక్క అబద్దం ఆడి కూతురుపెళ్లి చేశానని తృప్తి పడ్డారనుకోండి, నాకడుపు పండాలని ఇన్ని పూజలు, వ్రతాలు చేస్తుంటే చూస్తూఎలా ఊరుకోగలిగారండీ ఏడుస్తూ అడిగింది. నువ్వు మనస్ఫూర్తిగా అంగీకరించావనీ ఈ లెటరు వ్రాసిన నీ కన్నతండ్రే మనం పెళ్లిపీటల మీదనుంచి కిందకి వచ్చేసరికి నన్ను గదిలోకి తీసుకువెళ్లి ఏం అన్నారో తెలుసా బాబూ మాధవ్‌రావు మీరు వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నారని ముందే తెలిస్తే పెళ్లికి అంగీకరించదని ఆ విషయం మా అమ్మాయికి చెప్పలేదు. చదువు, సంస్కారం, ఉన్నత ఉద్యోగం అన్ని అర్హతలున్న మిమ్మల్ని అల్లుడిగా పొందాలంటే ఈ చిన్న అబద్దం ఆడక తప్పలేదు. దయచేసి ఈ విషయం మా అమ్మాయికి మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనైనా చెప్పకు బాబూ! అంటూ నా కాళ్ళవేళ్లబడి ప్రాధేయపడ్డాడు. ఉత్తరంలో అబద్దం వ్రాసి నీకు అన్యాయం చేసిన మీ నాన్నపై కోపంతో వెంటనే ఆవేశంగా ఈ విషయం చెబుదామని నీ దగ్గరకు వచ్చానుకాని ప్రియాంకా... నీ కాళ్ల పారాణి, నీ కంఠానికి వ్రేళ్లాడుతున్న మాంగల్యం, నీ నుదిట కుంకం తిలకం, నువ్వు ధరించిన పసుపు బట్టలు ఇవన్నీ నన్ను చూసి ఏమన్నాయో తెలుసా? నువ్వు మనిషివా పశువ్వా, నిండూ నూరేళ్లు నీ అర్ధాంగిగా వస్తున్న ఆ అబలను కనీసం పెళ్లయి నూరు నిముషాలైనా కాకుండా ఆమెకు ఈ భయంకమైన వార్త చెప్పి, ప్రియాంక శవాన్ని ఈ పచ్చని పందిరి కింద వదలి వెళ్ళిపోతావా అని హెచ్చరించాయి అందుకే... అందుకే నా ప్రయత్నం విరమించుకున్నాను. ఏనాడో ఆరిపోయిన నా ఇంటిదీపం వెలిగించిన జీవనజ్యోతి లాంటి భార్య దొరికినందుకు ఓ ప్రక్క ఆనందిస్తూ నీకు జరిగిన అన్యాయానికి ఇంకో పక్క నిత్యం నేనెంత కుమిలిపోతున్నానో నీకు అర్దం కాదు. తప్పచేసింది మీ నాన్న శిక్ష అనుభవిస్తుంది మన ఇరువురం. చూడు ప్రియాంకా జరిగిందంతా ఓ పీడకలగా మర్చిపో. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నువ్వు తల్లివి కావాలనుకొంటే నీకు ఇంకో వివాహం... అని ఇంకా ఏదో అనబోయేసరికి భర్త నోటికి అడ్డంగా చేయిచాచిన ప్రియాంక పిచ్చిగా ఏవండీ! అంటూ కేకవేసింది.

అప్పుడే కాన్వెంట్ నుంచి వస్తున్న రవి, సుజాతలను రెండు చేతులతో పట్టుకొని ఏడుస్తూ వీళ్లెవరండీ, నా బిడ్డలు కారా చెప్పండి వీళ్లే నా బిడ్డలు. వీళ్లే నా సర్వస్వం. కన్న ప్రేమకన్న పెంచిన ప్రేమే గొప్పదని అందులోనే నిజమైన మాతృత్వం దాగివుందని ఇప్పుడిప్పుడే తెలుసుకోగలిగాను అంటూ, పిల్లలిద్దర్నీ భోజనాల గదివైపు తీసుకుపోయింది ప్రియాంక.

మాధవరావు సానుభూతిగా భార్యవైపు చూస్తూ, ఇన్నాళ్ళకు నా క్షోభను చల్లార్చావ్ ప్రియాంకా! నిజంగా నువ్వు నా జీవన జ్యోతివి అంటూ తృప్తిగా శ్వాసపీల్చాడు.